
ప్రజాశక్తి

ఆదివారం 1 జనవరి 2023 5

పార్వతీపురం మన్యం



బాధిత రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-బలిజిపేట

అగ్నిప్రమాదంలో పంటను కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆవు సాంబమూర్తి కోరారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని అజ్జాడ గ్రామంలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో మామిడి పైడయ్య, మామిడి గుంప స్వామి, బోను చంద్రశేఖర్‌కు చెందిన 15 బస్తాలు ధాన్యం, వరుకుప్పలు దగ్ధమయ్యాయని చెప్పారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వంజరాపు సత్యంనాయుడు, గంట్యాడ బలరాం, బద్దాన భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొంగొత్త ఆశలు.. ఆశయాలతో..

చరిత్ర పుట్టల్లోకి 2022 సంవత్సరం

న్యూ ఇయర్ వేడుకల్లో ప్రజానీకం

నవ వసంతంలోకి



గిర్రున తిరిగే కాల చక్రంలో మరో ఏడాది (2022) కలిసిపోయింది. జ్ఞాపకాలను చరిత్ర పుటల్లో నిక్షిప్తం చేసింది. గత ఏడాది తీపి, చేదు జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ వీడ్కోలు పలికింది. కొత్త ఆశలను చిగురింపజేస్తూ నూతన సంవత్సరం (2023)లోకి అడుగుపెట్టింది. ఎన్నో ఆశలు.. ఆశయాలతో జిల్లా ప్రజలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. శనివారం అర్ధరాత్రి నుంచీ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇళ్లు, కార్యాలయాల ఎదుట రంగుల హరివిల్లులు, వెల్‌కమ్ బోర్డులు దర్శనమిచ్చాయి. పరస్పర కరచాలనాలు, బంధుమిత్రులు సెల్‌ఫోన్లలో శుభాకాంక్షల సంభాషణలో మునిగితేలారు. పుష్పగుచ్ఛాలు, పండ్లు, కేకుల క్రయ, విక్రయాలతో పట్టణ ప్రాంతాల్లో హడావుడి కనిపించింది. సంఘాలు, శాఖల, మిత్ర బృందాల వారీ విందు, వినోదాలు కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. పలు ఆలయాలు, చర్చిలు విద్యుత్ కాంతులతో కళకళ లాడాయి. హోటళు ,, పళ్లు, పుష్పగుచ్ఛాల దుకాణాలు కిటకిటలాడాయి. మద్యం విక్రయాల జోరు అమాంతంగా పెరిగింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కాలంలో కలిసిపోయిన 2022లో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా ఒకటేమిటి? అన్ని తరగతులకు చెందిన వారూ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా విజయనగరం ఉమ్మడి జిల్లాలో జ్యూట్ పరిశ్రమల మూత కారణంగా కార్మికులు అధిక సంఖ్యలో ఉపాధి కోల్పోయారు. సుగర్ ఫ్యాక్టరీల మూత వల్ల రైతులు అవస్థలు పడ్డారు. రహదారులు, ప్రాజెక్టుల కోసం భూ సేకరణలో రైతులు భూములు కోల్పోవాల్సి వచ్చింది. ఈ ఏడాది వరి దిగుబడి పెరిగినప్పటికీ పెట్టుబడులకు అనుగుణంగా గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం పోరాడాల్సి వచ్చింది. మునుపెన్నడూ లేనంతగా రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పోలీసుల నిర్బంధాలను, ప్రభుత్వ బెదిరింపులను ఎదుర్కోవాల్సివచ్చింది. వీరితోపాటు ఎప్పటి మాదిరిగానే స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా నిత్యం ఆందోళనలు చేయాల్సి వచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ 4న ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైంది. కొత్త కార్యాలయాలు ఏర్పాటై అధికారులు కొలువుదీరారు. విజయనగరం జిల్లాలో మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభమైంది. చీపురుపల్లి, బొబ్బిలి రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటయ్యాయి. అదే సందర్భంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమబాట పట్టారు. మరోవైపు జాతీయ విద్యా విధానం అమలుతో పాఠశాలల విలీనమై పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. ఇలా అన్ని తరగతుల ప్రజానీకం గత ఏడాది చేదు, తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎస్‌పి దీపికా పాటిల్ సహా పలువురు అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు జిల్లా ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రజలకు మేలు జరగాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రజల అభివృద్ధి సాధించాలని, ఆరోగ్యాంగం ఉండాని, సంక్షేమం వర్ధిలాలని, ప్రజలంతా సుఖ శాంతులతో మెలగాలని ఆకాంక్షిద్దాం.

అభివృద్ధి దిశగా పయనించాలి

నియోజకవర్గ ప్రజలతో పాటు, జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి. జిల్లా మరింత అభివృద్ధి దిశగా పయనించాలి. ప్రజలకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- కోలగట్ల వీరభద్రస్వామి, డిప్యూటీ స్పీకర్

సుఖ సంతోషాలతో ఉండాలి

ఉమ్మడి జిల్లా ప్రజలకు,ప్రజాప్రతినిధులకు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రజలంతా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో ఉండాలి. గత ఏడాది మాదిరిగానే కొత్త ఏడాది కూడా బాగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరగాలి. సాగు, తాగునీరు, విద్యా, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తాం.

-మజ్జి శ్రీనివాసరావు, జెడ్‌పి చైర్మన్

ప్రజలందరికీ మంచి జరగాలి

2023లో ప్రజలందరికీ మంచి జరగాలి. అందరూ ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో ఉండాలి. నూతన జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. పంటలు బాగా పండి రైతుల్లో ఆనందాలు వెల్లివిరియాలి. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- నిశాంత్‌కుమార్, జిల్లా కలెక్టర్

జీవితాల్లో వెలుగులు నింపాలి

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ఆయా కుటుంబాలు అభివద్దే పరమావధిగా భావిస్తోంది. అది నెరవేరాలని ఆకాంక్షిస్తున్నాను.

- పి.రాజన్నదొర, డిప్యూటీ సిఎం

నూతన సంవత్సర శుభాకాంక్షలు

నగర ప్రజలకు, శ్రేయోభిలాషులకు, కార్పొరేషన్ అధికారులకు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి. ప్రభుత్వ పథకాలతోనూ, నగరపాలక సంస్థ అందిస్తున్న సేవలతోనూ ప్రతి ఒక్కరు ఆనందంగా జీవించాలి. నగర సుందరీకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యాలు కావాలి.

- వి.విజయలక్ష్మి, విజయనగరం మేయర్

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి..

పక్కా ప్రణాళికతో అడుగులు

పాచిపెంటలో పారిశ్రామికవాడ : కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్

పార్వతీపురం మన్యం జిల్లా సర్వతోముఖాభివృద్ధే ధ్యేయమని, ఇందుకు పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయని, వాటిని అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి మార్గంలో ల్యాండ్ బ్యాంకు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాచిపెంట మండలంలో పారిశ్రామికవాడకు రెండు వేల ఎకరాలు గుర్తించామని వివరించారు.

జిల్లా మీదుగా మూడో రైల్వే లైన్ రావడం విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుడుతుందని చెప్పారు. విశాఖ - రాయపూర్ మార్గంలో పార్వతీపురం రైల్వేస్టేషన్ ఒక పెద్ద, ప్రధాన రైల్వే స్టేషన్‌గా ఆవిష్కృతం కానుందన్నారు. జాతీయ రహదారి - అరకు - పాడేరు - మన్యం జిల్లా - శ్రీకాకుళం జిల్లా గుండా వెళ్తున్న జాతీయ రహదారి-16తో అనుసంధానం చేయడం వల్ల ఈ ప్రాంతం పర్యాటకంగా వినూత్న అవకాశాలకు, అభివృద్ధికి నిలయంగా మారుతుందని చెప్పారు. అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సౌకర్యం కలుగుతుందన్నారు.

మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి, వైద్య కళాశాలకు స్థలాలను గుర్తించామని చెప్పారు. జనవరి 26వ తేదీలోగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు రూ.49.26 కోట్లతో ప్రారంభం అవుతాయని అన్నారు. దీంతోపాటు 18 కోట్ల రూపాయలతో మదర్ చైల్డ్ హెల్త్ కేర్ కేంద్రం ప్రత్యేకంగా రానుందని, ఇందులో 100 పడకలు ఉంటాయని చెప్పారు. ఆసుపత్రిలో వివిధ పనులను రెండు కోట్ల రూపాయలను అత్యవసర నిధిగా మంజూరు చేశామని, త్వరలో టెండర్లు పిలుస్తామని పేర్కొన్నారు. తద్వారా వైద్య పరంగా దశ పూర్తిగా మారుతుందన్నారు. జిల్లాలో సాలూరు, భద్రగిరి, కురుపాం తదితర సామాజిక ఆసుపత్రుల అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు చెప్పారు. 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు-నేడు కింద చేపట్టామని, ఆరు కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను నిర్మిస్తున్నామని వివరించారు.

నాడు-నేడు మొదటి దశలో 420 పాఠశాలల్లో రూ.111 కోట్లతో, రెండో విడతలో 545 పాఠశాలల్లో 144.82 కోట్ల రూపాయలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో పిఎంఎవై అర్బన్ కింద 24,176 గృహాలు మంజూరు కాగా 86 శాతం నిర్మాణాలు ప్రారంభమయ్యాయని, రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచామని వెల్లడించారు. త్వరలో వెయ్యి గృహ పట్టాలను కూడా పంపిణీ చేస్తామన్నారు. ఇంటి స్థలాల కోసం చేసిన భూ సేకరణకు పార్వతీపురంలో రూ.5.43 కోట్లు చెల్లించామన్నారు. జిల్లాలో మూడు జాబ్ మేళాలను నిర్వహించి దాదాపు 900 మంది అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ఎకో టూరిజం ప్రాజెక్టు చేపడుతున్నామని, ఈ ప్రాజెక్టు జనవరిలో ప్రారంభమవుతుందని, ఆరు నుంచి ఏడు కాటేజీలను నిర్మిస్తామని వివరించారు. సీతంపేట మండలంలో ఆడాలి వ్యూ పాయింట్ వద్ద ఆరు నుండి ఏడు కాటేజీలు రానున్నాయని చెప్పారు. జిల్లాలో ఏనుగుల సమస్య ఉందని, దీన్ని వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ చట్టం పరిధిలో చేపట్టటకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

కొండగూటికి పండగొచ్చింది



కురుపాం గ్రామంలో గొడ్డలమ్మ ఇంటింటికి తిప్పుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - కురుపాం

కొండగూటికి కందికొత్తల పండగ సందడి వచ్చింది. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే కందికొత్తల పండగ గిరిజనుల ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుంది. గిరిజన ఆచార సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. మన్యం వాసుల్లో ఆనందాన్ని, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపుతుంది. గిరిజనులకు అటవీ ప్రాంతాలతో విడదీయరాని అనుబంధం. కందికొత్తల పండగను మండలంలోని గిరిజన గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. గిరిజన దేవతలు గొడ్డళ్లమ్మ, సత్తరమ్మను అడవి నుంచి గ్రామానికి తీసుకొచ్చి యజ్జోడు పూజిస్తారు. గిరిజన గ్రామాల్లో పండిన పంటలు ముందుగా ఈ దేవతలకు బోనాలు పెట్టిన తర్వాతే వీరు భుజిస్తూ ఉంటారు. డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తారు. ఐదు రోజుల తర్వాత తిరిగి అడవిలోకి తీసుకెళ్లి విడిచి పెడుతుంటారు. ప్రతి ఏటా సంక్రాంతి ముందుగా గిరిజన గ్రామాల్లో గిరిజనులు పెద్దఎత్తున ఈ కంది కొత్తల ఉత్సవాలు నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది.

పెద్దమార్కెట్‌పై రచ్చ

శిథిలావస్థలో ఉన్న షాపులను కూల్చాల్సిందే

కౌన్సిల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ల డిమాండ్



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న అధికార పార్టీ కౌన్సిలర్లు

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని పెద్దమార్కెట్‌లో ఉన్న షాపులను కూల్చకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, ఇతర కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. శనివారం చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు అధికారపార్టీ కౌన్సిలర్లు జీరో అవర్‌లో పెద్దమార్కెట్ అంశాన్ని లేవనెత్తారు. నాలుగు నెలల క్రితం మార్కెట్‌లో శిథిలావస్థలో ఉన్న ఒక షాపు కూలిన సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారని అప్పలనాయుడుతో సహా కౌన్సిలర్ రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ చెప్పారు. మార్కెట్లో దాదాపు అన్ని షాపుల పరిస్థితి అలాగే ఉందన్నారు. ఒకవేళ మళ్లీ షాపులు కూలిపోయి ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. టిపిఒ రామకృష్ణ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం మార్కెట్‌లో షాపు కూలిన తర్వాత మొత్తం షాపుల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. షాపులు కూలిపోతే బాధ్యత షాపు యజమానులే వహించాలని నోటీసులిచ్చినట్లు చెప్పారు. నాలుగు నెలల క్రితం నోటీసులిస్తే ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు నిలదీశారు. కొంతమంది వ్యాపారుల చేతుల్లో ఎక్కువ షాపులున్నాయని, వారు మున్సిపాలిటీకి అతితక్కువ అద్దె చెల్లిస్తూ ఎక్కువ సొమ్ము వసూలు చేస్తున్నారని తెలిపారు. 25 సంవత్సరాలుగా కొద్దిమంది చేతుల్లోనే ఎక్కువ షాపులున్నాయని చెప్పారు. కొంతమంది వ్యాపారులు సొంత షాపులు మాదిరిగా పక్కా నిర్మాణాలు చేపడుతున్నారని, వారికి ఎవరు భరోసా ఇచ్చారని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు మాట్లాడుతూ మార్కెట్లో ఉన్న షాపులన్నీ కూల్చి కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు నిధుల్లేవని చెప్పారు. ఇప్పుడున్న రూ.90 లక్షలతో ఒక బ్లాక్ నిర్మాణం జరుగుతుందని వివరించారు. పెద్దమార్కెట్ షాపులకు సంబంధించి జిల్లా కోర్టులో ఒక కేసు పెండింగ్లో ఉందన్నారు. షాపులు కూల్చాలని తీర్మానాన్ని చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులున్నా పనులు జరగడం లేదని కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ చెప్పారు. కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించాలని, గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులు కూడా చేయడం లేదని ఆయన చెప్పారు. 14వ ఆర్థిక సంఘం నిధులు 6.3 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు 8.5 కోట్లు ఉన్నాయని కమిషనర్ శంకరరావు చెప్పారు. మార్చి నెలాఖరితో 14వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి గడువు పూర్తవుతుందని చెప్పారు. నాలుగైదు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బంగారమ్మపేటలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు కోరారు. ఈ సమావేశంలో వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు గిరి రఘు, పి.లక్ష్మణరావు, జి.నాగేశ్వరరావు,

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం 228 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ రామప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారని, ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుగౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేష్ హాజరవుతారని చెప్పారు. మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు

వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు

ప్రజాశక్తి-పాలకొండ

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు అన్నారు. శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వైసిపి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎనలేని అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. సచివాలయం ద్వారా మెరుగైన సేవలు అందుతున్నాయని, ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు విమర్శలు చేస్తున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే వి.కళావతి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా జగన్మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు డోల జగన్, ఎంపిపి బొమ్మాళి భాను, నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్లు పల్లా ప్రతాప్, రౌతు హనుమంతురావు, వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఆదరణతో వైసిపిలో వణుకు

మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

రాష్ట్రంలో టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనలకు లభిస్తున్న ఆదరణ చూసి వైసిపి నేతలు భయపడుతున్నారని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులుతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరు తొక్కిసలాట ఘటనపై వైసిపి నాయకులు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రలో మంత్రి ధర్మాన ప్రసాదరావు అవినీతి కథనాలపై ప్రజలు చర్చించుకుంటున్నారని, వారి దృష్టి మరల్చడానికి ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రం నినాదం తెరపైకి తీసుకువస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు జి.వెంకట నాయుడు, దేవకోటి వెంకట నాయుడు, ఉదయభాను, బోను చంద్రమౌళి, జాగాన రవికుమార్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై 6న ధర్నా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దంటూ 6న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, జిల్లా కమిటీ సభ్యులు కోలక అవినాష్ తెలిపారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకి కులాల వారిని ఎస్‌టి జాబితాలో చేర్చడానికి ప్రయత్నిస్తుందని, ఇది ఎంత మాత్రమూ సరికాదని అన్నారు. ఇప్పటికీ గిరిజనులకు ఉన్న హక్కులు, చట్టాలకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. వేలాది మంది గిరిజన యువత చదువుకుని ఖాళీగా ఉన్నారని తెలిపారు. ఇటువంటి తరుణంలో బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చితే గిరిజనులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని, నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను గిరిజన గ్రామాల్లో చేర్చాలని కోరారు. జీడి పంటకు నష్ట పరిహారం చెల్లించాలని, గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలని, చెడిపోయిన చెక్ డ్యాములకు మరమ్మతులు చేపట్టి, పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, నాయకులు ఎం సన్యాసిరావు, మోహన్ రావు, బిడ్డిక ఆడిత్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.



గుమ్మలక్ష్మీపురం.. ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కొమరాడ : గిరిజన సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల ఆరో తేదిన చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని గిరిజన సంఘం నాయకులు రామారావు, ప్రసాద్ కోరారు. శనివారం మండలంలోని కూనేరు సంతలో వాల్‌పోస్టర్లతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దని, గిరిజనులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మండింగ్ ప్రసాద్, బి.దాలియా, సిఐటియు మండల నాయకులు కె.సాంబమూర్తి, లక్ష్మణరావు, వెంకన్న, ప్రసాద్, నాగేశ్వరరావు, మధు, సుబ్బరాజ్, జనార్ధన, చక్రపాణి పాల్గొన్నారు.


ఉంటుందో..? ఊడుతుందో..?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పింఛను ఉంటుందో...! ఊడుతుందో... అర్థం కాని పరిస్థితి నెలకొందని కొందరు, మరీ ఇంత అన్యాయమా? ఏళ్ల తరబడి పింఛను ఇచ్చి, ఇప్పుడు నోటీసులా అంటూ మరికొందరు, రూ.250 పెంచుతున్నందుకు ఆ మేరకు పింఛన్లు తగ్గించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఈ విషయంలో అధికారులు, సచివాయల సిబ్బంది అత్యుత్సాహం కనబరుస్తున్నారని ఇంకొందరు ఇలా ఒక్కొక్కరూ ఒక్కో విధంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల పింఛను పెంపును ప్రకటించిన విషయం విధితమే. మరోవైపు వెయ్యి చదరపు అడుగుల ఇళ్లు, ఆదాయ పన్ను చెల్లించడం, 500యూనిట్ల విద్యుత్ వినియోగం, నాలుగు చక్రాల వాహనాలు వంటి ఆరు రకాల అర్హతలను ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులకు నోటీసులు జారీచేస్తున్న సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 4,800 మందికిపైగా నోటీసులు ఇచ్చినట్టు సాక్షాత్తు జిల్లా కలెక్టరే స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో వీరంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పింఛను పెంపు సమయంలోనే అనర్హులు గుర్తుకు వచ్చారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడో తాత తండ్రుల నుంచి 2.3సెంట్ల స్థలానికి మించిన స్థలంలో ఇల్లు ఉంటుంది. కానీ, వారికి సొంత భూమిగానీ, ఇతర ఆస్తిపాసులుగానీ లేవు. జీవనమే దినదిన గండంగా ఉంటుంది. ఇటువంటివారికి కూడా నోటీసులు అందాయి. ఒకేపేరుతో ఉన్న వేర్వేరు వ్యక్తులకు చెందిన విద్యుత్ మీటర్ల రీడింగ్ మెర్జి అయ్యింది. ఈ



విషయం అనేక సందర్భాల్లో జిల్లా పరిషత్ సమావేశంలో కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇటువంటివారి రీడింగ్ పరిమితికి మించి ఉండడంతో చాలా మందికి నోటీసులు అందాయి. పెళ్లయిన కూతురికి కారు ఉంటే, వృద్ధాప్యం పింఛను అందుకుంటున్న తండ్రికి నోటీసులు ఇచ్చారు. ఇలా ఓవైపు సాంకేతిక కారణాలు, మరోవైపు భౌతిక పరిస్థితులకు భిన్నమైన వైఖరితో వేలాది మందికి నోటీసులు ఇవ్వడంతో వారంతా బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. మరోవైపు అధికారులు మాత్రం పింఛన్ల ప్రక్షాళన, అర్హులకు మంజూరు అనేవి నిరంతర ప్రక్రియగా ఉంటుందని చెబుతున్నారు. పింఛనుదారులు మాత్రం దీన్ని కొట్టిపారేస్తున్నారు. అలా అయితే ఈ పాటికే అర్హులను తొలగించి ఉండేవారని, పింఛను పెంచుతున్న సమయంలోనే అర్హత అనర్హత అనేవి గుర్తుకు వచ్చాయంటే ఖచ్చితంగా పెరిగిన ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు అర్హత పేరిట కోత విధిస్తోందని అంటున్నారు. ఒకవేళ అధికారులు చెప్తున్నదే వాస్తవమనుకుంటే అనర్హులకు ఇన్నాళ్లూ ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ, ఆయా వంటి స్కీమ్ వర్కర్లు ఉన్న ఇళ్లల్లోనూ పింఛన్లు కోత విధించేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రక్షాళన పేరిట అర్హులకు అన్యాయం చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మరికొందరు విశ్లేషిస్తున్నారు.



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

హృద్రోగ బాలుడికి సిఎం ఆర్థిక సాయం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని చినదళితపేటకు చెందిన గొంప దినేష్ కార్తీక్‌కి డిప్యూటీ సిఎం రాజన్నదొర శనివారం సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.65 వేల చెక్కు అందజేశారు. కొద్దినెలల క్రితం గుండెకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకున్న దినేష్ కార్తీక్ పేద కుటుంబానికి చెందిన బాలుడు. దీంతో డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆర్థిక సాయం మంజూరు చేయించారు. వార్డు కౌన్సిలర్ లింగాల దుర్గ, వైసిపి నాయకులు లింగాల సింహాచలం సమక్షంలో రాజన్నదొర చెక్కు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో ఇంతవరకు 62 మందికి రూ.60 లక్షల మేర సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు చేసినట్లు రాజన్నదొర చెప్పారు.

ఎన్ఎఒబి ఎస్‌డిసిగా జ్ఞానవేణి

ప్రజాశక్తి-కలెక్టరేట్

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జి విభాగం పర్యవేక్షకులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొందిన జ్ఞాన వేణి అనకాపల్లిలోని నావల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్స్ బేస్ (ఎన్ఎఒబి) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శనివారం విధుల నుండి రిలీవ్ అయ్యారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆనంద్, డిఆర్ఒ జె.వెంకటరావును ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

ఐటిఐలో 60 శాతం మార్కులొస్తే..
పాలిటెక్నిక్‌లో ప్రవేశం

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిఐ కోర్సులలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్ కోర్సులలో రెండో సంవత్సరం నుండి ప్రవేశానికి వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్లు ఐటిఐ ప్రిన్సిపల్ టీవీ గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 9 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఉచిత బ్రిడ్జ్ కోర్సును నిర్వహిస్తారని, దీనికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు 9948582309 నంబరును సంప్రదించాలని సూచించారు.

ఆర్‌టిసి డ్రైవర్లకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

స్థానిక ఆర్‌టిసి డిపోలో శనివారం డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు ఆరోగ్య సమస్యలు రాకుండా ఏ విధంగా నివారించుకోవచ్చోనని అవగాహన కల్పించారు. డిపిటిఒ టివిఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో డిఎం ఇఎస్ కె దుర్గ, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, అసిస్టెంట్ మేనేజర్లు సుమిత్ర, రాము, వైద్య సిబ్బంది జయగౌడ్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ నిందితురాలు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం

బంగారు ఆభరణాలు చోరీ చేసిన నిందితురాలిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు రూరల్ సిఐ టివి తిరుపతిరావు శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. విజయనగరం మండల పరిధిలోని ముడిదాం గ్రామానికి చెందిన గంధ్రేటి గాయత్రి కుటుంబ సభ్యులతో కలిసి నవంబర్ 6న చీపురుపల్లి అత్తగారింటికి వెళ్ళింది. తిరిగి ఆమె విజయనగరం ఆటోలో వస్తుండగా విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర ఆమె తన బ్యాగ్‌ను చూసుకునేసరికి అందులో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. దీంతో ఆమె రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన రూరల్ పోలీసులు చెల్లూరు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె మౌనికను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆటోలో వస్తుండగా బంగారు ఆభరణాలను తానే చోరీ చేసినట్లు ఆమె విచారణలో అంగీకరించింది. ఆమె నుంచి బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీ సొత్తును త్వరిత గతిన రికవరీ చేసిన రూరల్ ఎస్ఐ గణేష్, ఎఎస్ఐ త్రినాధ్‌రావు, కానిస్టేబుల్ షఫీలను ఎస్‌పి ఎం. దీపిక అభినందించారు.

ఆదుకుంటామని అడ్రస్ లేకుండా చేశారు

ప్రజాశక్తి-జామి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో రాష్ట్రంలో ఉన్న అన్ని సహకార షుగర్ ఫ్యాక్టరీలను తాను ముఖ్యమంత్రి కాగానే తెరిపిస్తానని చెప్పి అధికారం వచ్చాక రాష్ట్రంలో ఆరు సహకార చక్కెర ఫ్యాక్టరీలను అడ్రస్ లేకుండా చేసారని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి విమర్శించారు. శనివారం భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని జామిలో చెరకు రైతులతో సమావేశమై చెరకు తోటలను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే చిత్తూరు జిల్లాలోని చిత్తూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ, అదే జిల్లాలోని గాజుల మండ్యంలోని వెంకటేశ్వర కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ, కడపజిల్లా లోని దౌలతాపురంలోని కడప కో-ఆపరేటివ్ షుగర్స్, నెల్లూరు జిల్లా కోవూరు కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ, గుంటూరు జిల్లాలోని ఎన్విఆర్ అండ్ ఏడిఆర్ కో-ఆపరేటివ్ షుగర్స్, విశాఖపట్నం జిల్లా తుమ్మపాల వి.వి.రమణ కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను పూర్తి స్థాయిలో మూత వేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసిందన్నారు. త్వరలోనే ఏటికొప్పాక, తాండవ, భీమసింగి షుగర్ ఫ్యాక్టరీల మూత వేసేందుకు తగిన చర్యలకు ప్రభుత్వం సిద్ధమవుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో రైతు నాయకులు వేంద్రపు నాయుడుబాబు, జామి అప్పారావు, వాసిరెడ్డి అప్పలనాయుడు, గొర్లె రాము, లగుడు రమేష్ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-వేపాడ

జగనన్న ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మినారాయణ కోరారు. మండలంలోని జాకేరు, కరకవలస గ్రామాల్లో శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు చేపట్టకపోతే ఆ స్థలాలను ప్రభుత్వం వెనుక్కు తీసుకుని వేరే వారికి కేటాయిస్తుందని వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద అప్పలనాయుడు, దుల్ల అప్పన్న, తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడిఒ పట్నాయక్, విస్తరణ అధికారి సిహెచ్ సూర్యనారాయణ ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరకవలసలో దర్యాప్తు ముమ్మరం

వేపాడ : మండలంలోని కరకవలస రెవెన్యూలో ప్రభుత్వ చెరువులను అక్రమార్కులు కప్పేస్తున్నారని అదే గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన తహశీల్దార్ కృష్ణంరాజు శనివారం దర్యాప్తు ముమ్మరం చేశారు. చదును చేసిన చెరువు జిరాయితీ గాను రికార్డులో ఉన్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి జి. శ్రీనివాసరావు తహశీల్దార్‌కు తెలుపగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించి ఆక్రమణకు గురైనట్లు తేలితే అక్రమదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామసభల్లో అభివృద్ధి పై చర్చించండి

శృంగవరపుకోట : జనవరి 2 నుంచి జరగనున్న గ్రామ సభల్లో సంక్షేమ పథకాల గురించే కాకుండా అభివృద్ధి గురించి, నిధులు, విధులు గురించి చర్చ జరపాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల ప్రసాద్ అన్నారు. శనివారం భవాని నగర్ గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రతి గ్రామ సభలోను పంచాయతీలో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చ జరపాలన్న పంచాయతీరాజ్ కమిషనర్ విడుదల చేసిన ఆదేశాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామ సభలపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా గ్రామ సభలు జరగాలని ఆయన కోరారు.

ఇంటెలిజెన్స్ వైఫల్యమా?
రాజకీయ వ్యూహమా?

- 'గడపగడపకు'లో రెండు గంటలే గడుపుతున్నారనే వాదన
- వైసిపి వర్క్‌షాప్‌లో రాజన్నదొరను ప్రశ్నించిన సిఎం
- అవాక్కయిన డిప్యూటీ సిఎం
- ప్రాబల్యం తగ్గించే వ్యూహమేనంటున్న శ్రేణులు



ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేల పనితీరునే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో గీటురాయిగా తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయాన్ని సిఎం జగన్ మోహన్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో స్పష్టం చేశారు. గడపగడపకు.. కార్యక్రమంలో చురుకుగా పాల్గొనకపోతే రానున్న ఎన్నికల్లో సీటు గల్లంతేనన్న సంకేతాలను పార్టీ అధ్యక్షులు జగన్ ఇచ్చారు. డిసెంబర్ నెల చివరి వారంలో గడపగడపకు కార్యక్రమంపై సిఎం జగన్ మోహన్ రెడ్డి.. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎమ్‌పిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఏ ఎమ్మెల్యే, ఏ మంత్రి పనితీరు ఎలా ఉందో ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ నిఘా వర్గాలు, పార్టీకి చెందిన సర్వే బృందాల నివేదికల ఆధారంగా ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరును అంచనా వేసినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా డిప్యూటీ సిఎం రాజన్నదొర పనితీరుపై సిఎం జగన్ చురకలంటించడం చర్చనీయాంశమైంది.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రోజుకు రెండు గంటలే డిప్యూటీ సిఎం రాజన్నదొర గడుపుతున్నారని సాక్షాత్తూ సిఎం జగన్ చెప్పడం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆశ్చర్యానికి గురి చేసింది. సిఎం లేవనెత్తిన రెండు గంటల అంశం రాజన్నదొరని కూడా షాక్‌కి గురి చేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీ అంతర్గత సర్వే బృందాలు, ప్రభుత్వ ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికల ఆధారంగానే సిఎం జగన్ రెండు గంటల అంశాన్ని లేవనెత్తి ఉంటారని భావిస్తున్నారు. అయితే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన నాటి నుంచి డిప్యూటీ సిఎం రాజన్నదొర నిరాటంకంగా ఆ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఏ గ్రామంలోనూ రెండు గంటలే తిరిగి కార్యక్రమాన్ని ముగించిన దాఖలాలు లేవు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఆయన ఆ కార్యక్రమంలోనే లీనమవుతున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఇంతవరకు డిప్యూటీ సిఎం రాజన్నదొర నియోజకవర్గంలో 89 సచివాలయాలకు గాను 54 సచివాలయాల పరిధిలో గడపగడపకు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. 123 రోజులపాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏ రోజు కూడా రెండు గంటలపాటు కార్యక్రమంలో పాల్గొని నిష్క్రమించిన దాఖలాలు లేవు. అత్యవసర సమావేశాలు ఉన్నప్పుడు మాత్రమే ఒకపూట కార్యక్రమంలో పాల్గొనేవారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన రెండు గంటలే గడపగడపకు కార్యక్రమంలో పాల్గొంటున్నారనే వాదన పూర్తి వాస్తవ విరుద్ధమని స్పష్టమవుతోంది.

అయితే సాక్షాత్తూ సిఎం జగన్ మోహన్ రెడ్డి నోట ఈ మాట వెలువడడం వెనుక ఆంతర్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ ఇంటెలిజెన్స్ వర్గాలు ఉద్దేశపూర్వకంగా నివేదిక ఇచ్చాయా, ఏమైనా ఒత్తిడి కారణంగా అలా నివేదించారా అనేది అంతుచిక్కడం లేదు. ఆయన కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో పార్టీ అంతర్గత సర్వే బృందం సభ్యులు కూడా ఉంటున్నారు. ఇలాంటి తరుణంలో రాజన్నదొరపై నీలాపనిందలు రావడం వెనుక ప్రత్యర్థి వర్గాల వ్యూహమో, ఇంటెలిజెన్స్ వైఫల్యమో ఉండొచ్చుననే చర్చ సాగుతోంది. పార్టీలో ఆయనని తెరమరుగు చేయడానికి, డి గ్రేడ్ చేయడానికి ప్రణాళికా బద్ధంగా కొంతమంది నాయకులు తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. కొద్దిరోజుల క్రితం తెరపైకి వచ్చిన తాజా వాదనను నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు కొట్టిపారేస్తున్నారు. పార్టీ అధిష్టానం వద్ద ఆయన ప్రాబల్యాన్ని తగ్గించే వ్యూహంలో భాగంగానే ఇలాంటి వాదనలు తెరమీదకు తెచ్చారని భావిస్తున్నారు.

సమస్యలను ఎత్తిచూపితే పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే జోగారావు



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో ఉన్న 30 వార్డుల్లో ఉన్న దీర్ఘకాల సమస్యలు అధికార, ప్రతిపక్ష సభ్యులు ఎత్తిచూపితే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 37 అంశాలను మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపిస్తుండగా, టిడిపి కౌన్సిలర్లు ద్వారపురెడ్డి శ్రీదేవి, కోరాడ నారాయణరావు, ఇండిపెండెంట్ కౌన్సిలర్ రణభేరి బంగారి నాయుడు జోక్యం చేసుకున్నారు. అభివృద్ధి పనులను కొన్ని వార్డులకు పరిమితం చేయకుండా అన్ని వార్డులలోనూ చేపట్టాలని కోరారు. కొంతకాలంగా మూణ్నాలుగు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా అవుతుందని, దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పింఛనుదారులకు నోటీసులివ్వడం అన్యాయమన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా చాలామంది వ్యాపారులు దుకాణాలను పెడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగజేస్తున్నారని చెప్పారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య కొంతసేపు వాదోపవాదాలు జరిగాయి. కమిషనర్ రామప్పలనాయుడు స్పందిస్తూ ఇటీవల రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించామని, ట్రాఫిక్ పోలీసులతో కలిసి అపరాధ రుసుం కూడా వేశామని, చెప్పారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని కొంత సమయం కావాలని వ్యాపారాలు కోరారని తెలిపారు. అనంతరం 2022-23 ఆర్థిక సంవత్సరపు సవరించిన బడ్జెట్, 2023-24 అంచనాల బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇండుపూరు గున్నేష్, ఫ్లోర్‌లీడర్ మంచి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పోడుపట్టాల ఘనత మాదే

పార్వతీపురం రూరల్ : గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యధికంగా పోడు పట్టాలు అందించిన ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం మండలంలోని డికెపట్నం పంచాయతీ పరిధిలోని బొడ్డవలస, రొంకి గ్రామాలలో ఐదో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను వారికి అందించి ఆదుకుంటుందన్నారు. ఏ ప్రభుత్వము ఇవ్వలేనంతగా గిరిజనులకు పోడుపట్టాలను అందించిన ఘనత తమదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.భాగ్యశ్రీ, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాథరావు, వైసిపి మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాచిపెంట

సిడిపిఒ అనంతలక్ష్మి

పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ హెల్పర్లు, మినీ అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. మండలంలో 5 అంగన్వాడీ హెల్పర్లు, మూడు మినీ అంగన్వాడీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. బొర్ర మామిడి పంచాయతీ కంచూరు, మోదుగ, మూటకూడు, విశ్వనాథ పురం, మిలియాకంచూరులో అంగన్వాడి హెల్పర్ల పోస్టులు, మోదుగ పంచాయతీ లోవవలస, కోటికిపెంట పంచాయతీ వలసిల మడ, బొర్రమామిడి పంచాయతీ రావివలసలో మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల ఆరో తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

సీతంపేట : మండలంలో రాజుగాడిగూడ, నడిమిగూడ, గూరండి మినీ అంగన్వాడీ కార్యకర్తలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ పి.రంగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తుంబకొండ మెయిన్ సెంటర్ హెల్పర్ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అక్కడే భోజనాలు మరుగుదొడ్లు



మరుగుదొడ్ల దగ్గరే భోజనం ప్లేట్లతో నిలబడిన విద్యార్థులు

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ పట్టణంలో ఇందిరానగర్ కాలనీలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో సమస్యలు కొలువు తీరుతున్నాయి. విద్యార్థులు తలదాచుకుంటున్న వసతి గృహాలను అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. విద్యార్థులు సమస్యల మధ్యే కాలం వెల్లదీస్తున్నారు. సుమారు 200 మంది ఉంటున్న వసతిగృహంలో కనీస సదుపాయాలు కూడా కరువయ్యాయి. విద్యార్థులకు వడ్డించే ప్రాంతం పక్కనే మరుగుదొడ్లు ఉండడంతో కొంత అసౌకర్యానికి గురవుతున్నారు. చేసేదేమీ లేక అక్కడే భోజనం చేయాల్సిన పరిస్థితి వస్తుంది.



నాసిరకం భోజనం చేస్తున్న విద్యార్థులు

అరకొరగా మెనూ అమలు

మెనూ చార్ట్ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాల్సి ఉన్నప్పటికీ అరకొరగానే భోజనం అందుతుంది. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలీచాలని అన్నం, కూర, రసం వడ్డించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో విద్యార్థులకు ఆ ఆహారమే గత్యంతరమవుతుంది.



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

సీతంపేటలో ప్రజావేదిక

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో ఈ నెల 13 నుండి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. శనివారం స్థానిక వైటిసిలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రజావేదిక ఏర్పాటు చేశారు. మండలంలో 65.13 కోట్లతో 5566 పనులు నిర్వహించామని అధికారులు తెలిపారు. అదే విధంగా రూ.19.78 కోట్లతో మెటీరియల్ పనులు చేసినట్లు వివరించారు. పంచాయతీల్లో అధికంగా రహదారులకు ఇరువైపులా ఉపాధి హామీలో మొక్కలు నాటినప్పటికీ ఎక్కడా కనిపించలేదని తెలిసింది. 80 శాతం వరకు మొక్కలు లేనట్లు ప్రజావేదికలో వెల్లడైంది. దీనిపై సుమారు 15 మంది ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేస్తామని అధికారులు చెప్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, ఎపిడి శ్రీహరి, బి.నారాయణరావు, విజిలెన్స్ అధికారి రామారావు, ఎస్ఆర్‌పిలు సూర్యనారాయణ, పిఆర్ జెఇ కిరణ్ రాజ్, ఎపిఒలు సాగర్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు ప్రభుత్వమే వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-పాలకొండరూరల్

గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల గ్రీన్ అంబాసిడర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలల తరబడి వేతన బకాయిలు ఉండడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పంచాయతీల నుంచి కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలన్నారు.

అనంతరం మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా కాద రాము, అధ్యక్షులుగా ఎన్.గురువులు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ శంకరరావు, కోశాధికారిగా కె.కూర్మారావు, ఉపాధ్యక్షులుగా బి.రవి, కార్యదర్శిగా ఎం.వైకుంఠరావు, కార్యవర్గ సభ్యులుగా యు.పైడన్నదొర, ఆర్.పకీరు, జి.దుర్గారావు ఎన్నికయ్యారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-సీతానగరం

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్ రెడ్డి అన్నారు. మండలంలోని గెడ్డలుప్పి గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన ఇళ్లను పూర్తి చేయాలని, నిర్మాణానికి బిల్లులు వెంటనే అవుతున్నాయని చెప్పారు. లబ్ధిదారులకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరేందుకు ప్రతి లబ్ధిదారుడు తన పని వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లు తిరుపతినాయుడు, హౌసింగ్ ఎఇ జానకిరామ్, ఎపిఎం ఆర్.శ్రీరాములు, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శులు సిహెచ్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పార్వతీపురం ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం పట్టణ ప్రధాన రహదారిలో ఉన్న సాయిష్ పేలస్‌లో సంఘం సభ్యులు సమావేశమయ్యారు. నూతన అధ్యక్షులుగా అధికారి రామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా బాలాజీ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా గొడబ సురేష్, ఉప కార్యదర్శిగా గంటా శ్రావణ్‌కుమార్, కోశాధికారిగా సందీప్ ఎన్నికయ్యారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -భామిని

స్థానిక ఎంఆర్‌సి వద్ద యుటిఎఫ్ క్యాలెండర్, డైరీని ఎంఇఒ ఆనందరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆయన నూతన సంవత్సరం శుభాకాంక్షలు ముందస్తుగా తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఇ.తిరుపతి, కె.ప్రసాదరావు, సహాధ్యక్షులు పంటల తిరుపతిరావు, కోశాధికారి మహేష్, ప్రధానోపాధ్యాయులు ఆర్.ఆనందరావు, ఉపాధ్యాయులు కిశోర్, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, మాధవరావు, రమేష్, నాగయ్య, స్వర్ణలత, లక్ష్మి, సుప్రియ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్, తదితరులు

ఎపిఎన్‌జిఒ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాలకొండ

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ క్యాలెండర్‌ను శనివారం సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులంతా బాధ్యతగా పనిచేయాలని, ఎవరికి ఎటువంటి సమస్య ఉన్నా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ సావిత్రి, పాలకొండ ఉపతహశీల్దార్ బి.బుచ్చియ్య, ఎపిఎన్‌జిఒ డివిజన్ గౌరవ అధ్యక్షులు లిల్లీపుష్పనాథం, అధ్యక్షులు రంగాచారి, కార్యదర్శి ఈశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు రమేష్, నాయుడు పాల్గొన్నారు.

శ్రీదేవి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-పాలకొండ

ఎల్ఎన్‌పేట కెజిబివిలో ఎస్ఒగా పనిచేస్తున్న శ్రీదేవి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం స్థానిక పెదకాపువీధిలో నివాసముంటున్న శ్రీదేవి కుటుంబ సభ్యులను మాజీ విప్ కూన రవికుమార్ పరామర్శించారు. మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు బూర్జ జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఆనెపు రామకృష్ణ, తదితరులున్నారు.